www.aksharavelugu.com

# అక్షర వెలుగు

www.aksharavelugu.com

తెలుగు దిన పత్రిక

మంగళ వారం
28 జూన్ 2022

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్
సంపుటి - 01, సంచిక-108
పేజీలు - 4 వెల రూ. 5

ఎడిటర్ :
గోసుకొండ పృధ్వీరాజు

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థిగా యశ్వంత్ నామినేషన్

రాజ్యసభ సెక్రటరీకి నామినేషన్ పత్రాలు అందచేత ● హాజరైన రాహుల్, కెటిఆర్, పవార్, సీతారామ్ ఏచూరి తదితరులు



**న్యూఢిల్లీ, జూన్ 27 (అక్షర వెలుగు):** విపక్షపార్టీల రాష్ట్రపతి అభ్యర్థిగా మాజీ కేంద్రమంత్రి యశ్వంత్ సిన్హా నామినేషన్ వేశారు. ఆయన వెంట కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తదితరులు వెంటరాగా ఆయనతన నామినేష్ వేశారు. రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీకి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, **3**

## మోడీపై తెలంగాణ నుంచే తిరుగుబాటు



- దేశంలో నడుస్తోంది మోడీ రాజ్యాంగమే
- రాష్ట్రాల హక్కులను హరిస్తున్న మోడీ
- తెలంగాణకు రూపాయి ఎక్కువిచ్చినా రాజీనామా చేస్తా
- ప్రశ్నించిన విపక్షాలపై దర్యాప్తు సంస్థల ఉసిగొలుపు
- ఢిల్లీలో మీడియా సమావేశంలో మంత్రి కెటిఆర్ ఘాటు విమర్శలు

**న్యూఢిల్లీ, జూన్ 27 (అక్షర వెలుగు):** ప్రధాని నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణ నుంచే తిరుగుబాటు వస్తుందేమోనని టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై ప్రజలు తిరగబడే రోజులు తప్పకుండా వస్తాయన్నారు. దేశంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదు.. మోదీ రాజ్యాంగం అమలవుతుందని నిప్పులు చెరిగారు. విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హా నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణకు, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పని చేస్తారనే సంపూర్ణ విశ్వాసంతో యశ్వంత్ సిన్హా అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపామని కేటీఆర్ తెలిపారు. టీఆర్ఎస్ పార్టీ తరపున సంపూర్ణగా మద్దతు ప్రకటించామని అన్నారు. యశ్వంత్ సిన్హాను హైదరాబాద్ రావాలని ఆహ్వానించాం. హైదరాబాద్‌లో తమ ఎంపీలు, శాసనసభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి ఆయనకు మద్దతు తెలుపుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఒక నియంతలా వ్యవహరిస్తోందని, నిరంకుశ విధానాలతో, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ.. గత 8 ఏండ్ల నుంచి ఆయా రాష్ట్రాలకు అన్యాయం చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. 8 రాష్ట్రాల్లో వారికి మెజార్టీ లేకపోయినా ఆయా ప్రభుత్వాలను తలకిందులు చేసి, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా బరితెగింపు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. రాజ్యాంగ సంస్థలను తమ గుప్పిట్లో ఉంచుకొని విపక్షాల మీద వేటకుక్కల్లాగా వాటిని ఉసిగొల్పి రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నారని ప్రధాని మోదీపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దాన్ని తిరస్కరించాల్సిన బాధ్యత ప్రజాస్వామ్యంపై నమ్మకమున్న అన్ని పార్టీలకు ఉంటుందన్నారు. బీజేపీ ప్రతిపాదించిన అభ్యర్థిని నిర్ద్వందంగా తిరస్కరిస్తున్నామని తేల్చిచెప్పారు. బీజేపీ నిర్ణయానికి వ్యతిరేకంగా, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న వైఖరికి వ్యతిరేకంగా, అత్యున్నతమైన రాష్ట్రపతి పదవికి విపక్షాలు బలపరిచిన యశ్వంత్ సిన్హాకు మద్దతు ఇస్తున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు. యశ్వంత్ సిన్హాకు మద్దతివ్వాలని ఇతర పార్టీలకు కూడా విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. యశ్వంత్ సిన్హా గెలువాలని, **2**

## నేడు ఇంటర్ ఫలితాలు విడుదల



ఫలితాలు ప్రకటించనున్న మంత్రి సబిత

**హైదరాబాద్, జూన్ 27 (అక్షర వెలుగు):** ఇంటర్మీడియట్ ఫలితాలను 28వ తేదీ మంగళవారం విడుదల చేయాలని ఇంటర్ బోర్టు నిర్ణయించింది. ఉదయం 11 గంటలకు రాష్ట్ర విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి ఈ ఫలితాలను ప్రకటించనున్నారు. రాష్ట్రంలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను మే 6వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 9.07 లక్షల మంది ఉన్నారు. ఈ ఫలితాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చని అధికారులు ప్రకటించారు. కాగా పదో తరగతి పరీక్ష ఫలితాలను 30న లేదంటే జూలై 1వ తేదీన విడుదల చేసే అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇంటర్ **2**

## ఘనంగా మోడీ బహిరంగ సభ



లక్షలాదిగా వస్తారంటున్న డికె అరుణ

**హైదరాబాద్, జూన్ 27 (అక్షర వెలుగు):** చరిత్రలోనే గొప్ప సభగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభ నిలిచిపోతుందని బీజేపీ సీనియర్ నేత డీకే అరుణ అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... మోదీ సభకు లక్షలమంది ప్రజలు, కార్యకర్తలు వస్తున్నారని తెలిపారు. తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని సీఎం కేసీఆర్ కోల్పోయారన్నారు. తెలంగాణ ప్రజలు నరేంద్ర మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ నియంత మాదిరి పరిపాలన సాగిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబం మాత్రమే బంగారు కుటుంబంగా మిగిలిందని వ్యాఖ్యానించారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. తెలంగాణ తల్లికి కేసీఆర్ బేడీలు వేశారని, ఎన్నికల హామీలు అమలులో విఫలమయ్యారని డీకే అరుణ విమర్శలు గుప్పించారు.

## మోడీకి నిరసనలు తెలుపుదాం



అగ్నిపథ్‌పై హైదరాబాద్‌లో నిలదీద్దాం ● కాంగ్రెస్ శ్రేణులకు రేవంత్ పిలుపు

మల్కాజిగిరిలో సత్యాగ్రహ దీక్షలో రేవంత్

**హైదరాబాద్, జూన్ 27 (అక్షర వెలుగు):** బిజెపి జాతీయ సమావేశాల సందర్భంగా ప్రధాన మంత్రినరేంద్ర మోదీహైదరాబాద్ వచ్చినప్పుడు నిరసనలు తెలియజేయాలని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ యువతకు మోదీ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే మోదీ పర్యటనలో నిరసనలు వ్యక్తం చేస్తామన్నారు. మోదీకి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా యువతన నిరసన తెలపాలని అన్నారు. కేంద్రం వెంటనే అగ్నిపథ్‌ను వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందన్నారు. రైల్వే ఆస్తుల ధ్వంసం కేసులో అరెస్ట్ అయిన **2**

## గజ్వేల్‌కు చేరుకున్న తొలి గూడ్స్ రైలు

స్వాగతం పలికిన మంత్రులు హరీష్ , నిరంజన్ రెడ్డి



**సిద్ధిపేట, జూన్ 27 (అక్షర వెలుగు):** గజ్వేల్ కు తొలి గూడ్స్ రైలు చేరుకుంది. తొలి విడుతగా కాకినాడ నుంచి 13 బోగీలలో 1300 మెట్రిక్ టన్నుల ఎరువుల లోడ్‌ను తీసుకుని వచ్చింది. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ లో ఎరువుల రేక్ పాయింట్ ను మంత్రులు హరీష్ రావు, నిరంజన్ రెడ్డి ప్రారంభించారు. తొలి విడతలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడలోని ఎన్ఎఫ్ సీఎల్ నుంచి గజ్వేల్ కు 12 బోగీల గూడ్సు రైలు 1300 మెట్రిక్ టన్నుల ఎరువుల లోడు తీసుకుని వచ్చింది. ఈ ఎరువుల రేక్ పాయింట్ కు అనుసంధానంగా సరకు రవాణా జరగనుంది. రువుల కోసం 4 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన రెండు గిడ్డంగులను నిర్మించారు. దీంతో ఇవాల్టి నుంచి గజ్వేల్ కు గూడ్స్ రైలు రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఎరువుల రేక్ పాయింట్ ప్రారంభ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్సీ లు ఫారూఖ్ హుస్సేన్, యాదవరెడ్డి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## మోడీ, కెసిఆర్‌లను సాగనంపాలి

ప్రజా ప్రస్థానంలో వైఎస్ షర్మిల పిలుపు



**నల్లగొండ, జూన్ 27 (అక్షర వెలుగు):** ప్రజా పాలనను పక్కన పెట్టిన కేసీఆర్, మోడీని సాగనంపాలని వైఎస్ఆర్టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రజలకు పిలుపునిచ్చారు. షర్మిల చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్ర 107వ రోజు ఉమ్మడి నల్గొండ జిల్లాలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పేదవాడు కూడా కార్పొరేట్ వైద్యం చేయించుకోవాలని వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెడితే... కేసీఆర్ ప్రభుత్వం ఆ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. దళితులకు మూడెకరాలు, ఫీజు రీఎంబర్స్? మెంట్, ఉచిత ఎరువులు, డబుల్ బెడ్రూం ఇళ్లు ఏమయ్యాయనిర్ అయ్యారు.

## పోడుభూములకు పట్టాలెప్పుడు?

ఇంకెన్నాళ్లు దాడులు చేస్తారు: సీతక్క



**ములుగు, జూన్ 27 (అక్షర వెలుగు):** పోడు భూములకు పట్టాలిస్తానని ఎన్నికల్లో గెలిచిన కేసీఆర్.. అధికారంలోకి వచ్చాక పోడు భూముల రైతుల్ని మర్చిపోయాడని ఎమ్మెల్యే సీతక్క మండిపడ్డారు. పోడు భూమి రైతులకు పట్టాలిచ్చి వారిని యజమానులను చేసింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. ఆదివాసీ మహిళలపై అధికారుల దాడులు ఆపాలన్నారు. ఓవైపు రైతులపై ప్రేమ ఒలకబోస్తూ మరోవపు అధికారులతో దాడి చేయించడం తగునా అని ప్రశ్నించారు. వందల మంది ఆదివాసీల పైన కేసులు పెట్టింది టీఆర్ఎస్ ప్రభుత్వం వారికి న్యాయం చేస్తుందని అనుకోవడానికి లేదన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఆదివాసీలను చిన్న చూపు చూస్తుందే ఉదారత చూపడం లేదన్నారు. హరితహారం పేరు మీద దాడులు చేస్తున్నారు. గిరిజన భూములు లాక్కుని లే అవుట్‌లు వేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పోడు భూముల సమస్య పరిష్కారం అవుతుందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం పోవాలి. పేదల ప్రభుత్వం రావాలని అంతా కోరుకుంటున్నారని అన్నారు. రుణమాఫీ హామీ ని గాలికొదిలేసారు. ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదు. ఏజెన్సీ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధరణి వల్ల ప్రతి రైతు ఇబ్బంది పడుతున్నాడని ఆమె అన్నారు.

## సమాజ్‌వాదీ అసమర్థ బయటపడింది

ముస్లింలు ఇలాంటి పార్టీలకు ఓటేయొద్దు

ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఓవైసీ వ్యాఖ్య



**హైదరాబాద్, జూన్ 27 (అక్షర వెలుగు):** ఉత్తర్‌ప్రదేశ్‌లో 2 లోక్ సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో సమాజ్ వాది పార్టీకి పరాభవం తప్పలేదు. అజంగఢ్, రాంపూర్ రెండు స్థానాల్లో ఓటమి పాలైంది. ఇక్కడ రెండు చోట్ల బీజేపీ విజయం సాధించింది. ఈ నేపథ్యంలో సమాజ్ వాది పార్టీపై ఓటమిపై ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ స్పందించారు. ఎస్పీ ఓటమి, అఖిలేష్ యాదవ్ పై ఆయన సెటైర్లు వేశారు. బీజేపీని ఓడించే సామర్థ్యం సమాజ్ వాదీ పార్టీకి లేదని యూపీ బైపోల్ రిజల్ట్ నిరూపించిందని అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. రాంపూర్, అజంగఢ్ లోక్ సభ ఉప ఎన్నికల ఫలితాలు సమాజ్ వాద్ పార్టీ అసమర్ధతను బయట పెట్టాయ న్నారు. అసమర్ధ పార్టీలకు మైనార్టీ వర్గాలు ఓట్లు వేయకూడదన్నారు. పార్టీ ఓటమికి అఖిలేష్ యాదవ్ కారణమని ఆయన ఆరోపించారు. అహంకార ధోరణితో ప్రజల్లోకి వెళ్లలేదని మండిపడ్డారు. యూపీ ఉప ఎన్నికల ఫలితాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఫలితంతో.. బీజేపీని ఓడించే దమ్ము సమాజ్‌వాదీ పార్టీకి లేదని స్పష్టం అవుతోందని అన్నారు. యూపీ ఉప ఎన్నికల ఫలితాలు.. సమాజ్‌వాదీ పార్టీకి బిజెపీని ఓడించే దమ్ము లేదని నిరూపించాయి. అసలు ఆ పార్టీకి అంత మేధో నిజాయితీ లేదని తేలింది. ఇలాంటి అసమర్థ పార్టీలకు దయ చేసి మైనారిటీలు ఓట్లు వేయకండి అని ఒవైసీ పిలుపు ఇచ్చారు. ఇప్పుడు ఎవరికి బీజేపీ బి-టీమ్, సి-టీమ్ అని పేరు పెడతారో అంటూ అఖిలేష్ యాదవ్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు ఒవైసీ. అంతేకాదు రాంపూర్, ఆజాంఘడ్ ఉప ఎన్నికల్లో ఓటమికి ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్‌నే బాధ్యుడిగా విమర్శించారు. అఖిలేష్ యాదవ్ అహంభావి. కనీసం.. ప్రజలను కూడా కలవలేకపోయాడు. దేశంలోని ముస్లింలు తమకంటూ ఒక రాజకీయ గుర్తింపు తెచ్చుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా అంటూ పేర్కొన్నారు

## రాకేశ్ కుటుంబానికి 25లక్షల సాయం

కుటుంబంలో ఒకరికి ఉద్యోగ భద్రత

సంస్మరణ సభలో నియామక పత్రాలు అందించిన ఎర్రబెల్లి



**వరంగల్, జూన్ 27 (అక్షర వెలుగు):** దేశం కోసం రాకేశ్ అంకితమయ్యాడని, రాకేశ్‌ఆత్మ బలిదానం వృథా కాదని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సైనికులలో చేరాలనే కాంక్షతో దేశ భక్తికి స్ఫూర్తిగా నిలిచాడని కొనియాడారు. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం, దబ్బీర్ పేట గ్రామంలో రాకేశ్ సంస్మరణ సభ సోమవారం జరిగింది. ఈ సభలో రాకేశ్ కుటుంబానికి సీఎం కేసిఆర్ ప్రకటించిన 25 లక్షల ఎక్స్ గ్రేషియా, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం నియామక పత్రాలను మంత్రి ఎర్రబెల్లి రాకేశ్ కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈసందర్భంగామంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ ఇంత జరిగినా రాకేశ్ కుటుంబాన్ని కేంద్రం ఆదు కోలేదని,సీఎం కేసిఆర్ మానవతా దృక్పథంతో ఆదుకున్నారని అన్నారు. వాళ్ళ ఇంటిలో ఒకరికి రెవెన్యూ విభాగంలో వారి విద్యార్హత ను బట్టి ఆఫీస్ సబార్డి నేట్ ఉద్యోగం ఇచ్చారని చెప్పారు. మూలపోడు చేసుకుని బతికే గ్రామం నుంచి దేశ రక్షణకు వెళ్ళాలని అనుకున్న రాకేశ్ గొప్పతనం అందరికీ ఆదర్శమని అన్నారు.రాకేశ్ ఆత్మ శాంతించాలంటే వెంటనే అగ్నిపథ్ ను వెనక్కి తీసుకోవాలని మంత్రి ఎర్రబెల్లి డిమాండ్ చేశారు.తెలంగాణ ఉద్యమ **2**

## సంపాదకీయం

# విపక్షాలు గుణపాఠం నేర్చుకోవాలి !

ఉపఎన్నికల ఫలితాల్లో భాజపా విజయఢంకా మోగించింది. రాష్ట్రపతి ఎన్నికలకు ముందు విపక్షాలకు ఇదో గట్టి దెబ్బగానే భావించాలి. ముఖ్యంగా యూపిలో సమాజ్‌వాదికి, పంజాబ్‌లో ఆప్‌కు కోలుకోలేని దెబ్బ తగిలింది. ముఖ్యంగా యూపిలో రెండు ఎంపి సీట్లు గెల్చుకోవడం అన్నది పెద్ద విజయంగానే చూడాలి. ఈ రెండు సీట్లు కూడా సమాజ్‌వాదీకి చెందినవే. అంతులో ఒకటి మాజీ సిఎం అఖిలేశ్ రాజీనామా చేసిన ఆజంఘడ్ ఉంది. ఇదో రకంగా సమాజ్‌వాదీ పట్ల ఉన్న వ్యతిరేకత బయటపడిందినే చెప్పాలి. అలాగే ఆప్‌కు కూడా పంజాబ్‌లో అధికారం దక్కించుకున్న కొంతకాలనికే ఎదురుదెబ్బ తగిలింది. అక్కడ ప్రస్తు సిఎం మాన్ వదిలిన లోక్‌సభలో ఓటమిచవి చూసింది. ఇదంతా కూడా ప్రజల ఆలోచనా ధోరణిలో వస్తున్న మార్పులకు నిదర్శనంగా చూడాలి. ప్రజలు కూడా విపక్షాల తీరుపై అసంతృప్తిగా ఉన్నారని అనుకోవాలి. రాష్ట్రపతి ఎన్నికల్లో ఐక్యత చాటలేక పోయిన విపక్షాలు తమ అభ్యర్థిగా మాజీ బిజెపి నేత, మాజీ కేంద్ర మంత్రి యశ్వంత్ సిన్హాను బరిలోకి దింపింది. ఎన్‌డిఎ ఓ గిరిజన మహిళ ద్రౌపది ముర్మను బరిలోకి దింపినా పోటీనుంచి తప్పుకోవడానికి విపక్షాలు సిద్దంగా లేవని కూడా తేలిపోయింది. యశ్వంత్ సిన్హా సోమవారం తన నామినేషన్ సమర్పించడంతో ఇక పోటీ అనివార్యమని తేలిపోయింది. అయితే ఉప ఎన్నికల ఫలితాలతో విపక్షాల్లో కనువిప్పు కలగడం లేదని కూడా అర్థం అవుతోంది. మరోవైపు మహారాష్ట్ర లో శివసేన పుట్టి మునుగుతోంది. శివసేన ప్రభుత్వం కూలడం ఖాయంగా కనిపిస్తోంది. సిద్ధాంతాలను పక్కన పెట్టి కాంగ్రెస్, ఎన్సీపిలతో పొత్తు పెట్టుకోవడం దారుణం కాక మరోటికాదు. ఇదిఆ పార్టీ మూలసిద్దాంతాలనే ప్రశ్నించేలా తయారయ్యింది. దీంతో తిరుగుబాటు తప్పలేదు. ఇకపోతే దేశవ్యాప్తంగా ఉపఎన్నికల ఫలితాల్లో భాజపా సత్తా చాటింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో విపక్ష సమాజ్‌వాదీ పార్టీ కంచుకోటలను బద్దలు కొట్టింది. ఎస్పీ సీనియర్ నేత ఆజంఖాన్‌కు అడ్డా అయిన రాంపుర్ పార్లమెంట్ స్థానంలో పాగా వేసింది. మరో పార్లమెంటు స్థానం ఆజంగఢ్‌లోనూ విజయబావుటా ఎగురవేసింది. మరోవైపు ఆప్.. దిల్లీలోని రాజిందర్ నగర్ స్థానాన్ని గెలుచుకోగా, పంజాబ్‌లో చతికిలపడింది. జూన్ 23న జరిగిన ఉపఎన్నికల ఫలితాలు తాజాగా వెలువడ్డాయి. ఉత్తర్‌ప్రదేశ్ రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా ఎదుగుతున్న అధికార భాజపా... సమాజ్ వాదీ పార్టీని గట్టి దెబ్బ కొట్టింది. ఎస్పీ సిట్టింగ్ స్థానమైన రాంపుర్ లోక్‌సభ స్థానంలో భాజపా జయకేతనం ఎగురవేసింది. ఎస్పీ నేత ఆజంఖాన్ రాజీనామాతో రాంపుర్ స్థానం ఖాళీ కాగా ఉపఎన్నికలో భాజపా అభ్యర్థి ఘన్ శ్యామ్ లోధి సుమారు 42వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రామ్‌పుర్ పార్లమెంటు పరిధిలో మొత్తం 18.38 లక్షల మంది ఓటర్లు ఉండగా.. అందులో 60శాతం మంది ముస్లిం, మైనారిటీలే ఉన్నారు. దీంతో ఆ స్థానం ఆజంఖాన్‌కు కంచుకోటగా మారింది. అయితే ఆ కంచుకోటను బద్దలుకొట్టిన యోగి ఆదిత్యనాథ్ సర్కార్ ఆ ప్రాంతంలోనూ భాజపాను తిరుగులేని శక్తిగా నిలబెట్టింది. మరోవైపు, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ రాజీనామాతో ఖాళీ అయిన ఆజంగఢ్ లోక్‌సభ స్థానంలోనూ భాజపా విజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి దినేశ్ లాల్ యాదవ్ 8679 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఇకపోతే తాజా ఉపఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పంజాబ్‌లో అధికార పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. సంగ్రూర్ లోక్‌సభ స్థానంలో శిరోమణి అకాలీదళ్ నేత సిమ్రన్ జీత్ మాన్ గెలుపొందారు. ఈ స్థానం నుంచి గెలుపొందిన ఆప్ నేత భగవంత్ మాన్.. పంజాబ్ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో సంగ్రూర్ లోక్‌సభ స్థానానికి ఉపఎన్నికలు జరిగాయి. మరోవైపు, దిల్లీలోని రాజిందర్ నగర్ అసెంబ్లీ స్థానాన్ని ఆప్ నిలబెట్టుకుంది. రాజ్యసభ ఎంపీగా గెలుపొందిన నేపథ్యంలో ఆ స్థానానికి ఆప్ నేత రాఘవ్ చద్దా రాజీనామా చేయగా.. ఎన్నికలు జరిగాయి. ఇందులో ఆప్ ఘన విజయం సాధించింది. అయితే ఇక్కడ బిజెపి పెద్దగా సత్తా చాటలేకపోయింది. త్రిపురలోనూ భాజపా హవా చాటింది. దేశవ్యాప్తంగా ఏడు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నిక జరగగా.. వాటిలో నాలుగు స్థానాలు త్రిపురలోనే ఉన్నాయి. తాజా ఫలితాల్లో భాజపా మూడు స్థానాల్లో గెలుపొందింది. మొత్తంగా ఫలితాలు విపక్షాలకు చెంపపెట్టులాంటివి. బిజెపిపై విమర్శలు గుప్పిస్తున్న ఆప్,సమాజ్‌వాదీలకు గట్టి షాక్ ఇచ్చాయి. ఈ క్రమంలో విపక్షాలు తమ ఐక్య చాటేందుకు మరింత ప్రణాళికతో ముందుకు సాగాలి. రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేయడం అన్న ఆలోచన విరమించాలి. పట్టుదలకు పోవడం వల్ల వచ్చే లాభం లేదు. అలాగే బిజెపి గెలుపును విమర్శించడం కూడా సరికాదు. నిజానికి దేశంలో గిరిజనులకు అవకాశాలు రావడం లేదు. వారిని జనజీవన స్రవంతికి దూరంగానే ఉంచుతున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు ముర్మకు మద్దతు తెలిపి ఏకగ్రీవం చేయడం ద్వారా విపక్షనేతలు ఔదార్యం చాటుకోవాలి. ఈ విషయంలో రాజకీయాలు పక్కన పెట్టాలి. ఇకపోతే అన్నివర్గాలకు భారత ప్రజాస్వామ్యంలో అవకాశం వస్తుందని ఆశించడానికి లేదు. ద్రౌపది ముర్మకు అవకాశం రావడానికి 75 ఏళ్లు పట్టింది. ఈ క్రమంలో గిరిజనులు, ఎస్సీలకు ప్రధానమంత్రి లాంటి ఉన్నత పదవులు దక్కాల్సి ఉంది. ఇందుకోసం రాజకీయాల్లో ఇప్పుడున్న పరిస్థితులు, రాజ్యాంగం మేరకు అవకాశం రాదు. ఎలాగూ అధికార కూటమి నుంచి ఎస్టీ మహిళకు అవకాశం ఇచ్చారు కనుక విపక్షాలు గౌరవప్రదంగా ద్రౌపది ముర్మను రాష్ట్రపతి భవన్‌కు పంపించడానికి సహకరించాలి. అయితే, అత్యున్నత పదవికి అభ్యర్థిగా ఎంపికలో ఆమె సమర్థత కన్నా మహిళ గా, ఆదివాసీగానే గుర్తించి ఇచ్చారు. ఉత్తర, దక్షిణ భారతం నుంచే రాష్ట్రపతులు ఎన్నికవుతూ వస్తున్న క్రమంలో దేశంలో తూర్పు ప్రాంతం నుంచి గిరిజన మహిళను బరిలోకి దింపడం ద్వారా బీజేపీ ఓ మంచి పని చేసిందనే చెప్పాలి. ఈ క్రమంలో విపక్షాలు తాజా ఎన్నికల ఫలితాలతో గగుణపాఠంనేర్చుకుంటే మంచిది.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# బస్సుప్రమాద మృతులకు సర్కార్ అండ

## బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ



**హైదరాబాద్, జూన్ 27 (అక్షర వెలుగు):** కర్ణాటకలో జరిగిన బస్సు ప్రమాదం ఘటన చాలా బాధాకరమని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కర్నాటక లోని కాలా బురగీ వద్ద జరిగిన ప్రమాదంలో మరణించిన హైదరాబాద్ లోని బొల్లారం కు చెందిన అర్జున్ కుమార్, అతని భార్య సరళ, కుమారుడు వివన్, ఐ.అనిత,గోదేఖీ ఖబర్ కు చెందిన శివకుమార్, అతని భార్య రవళి, కుమారుడు దీక్షిత్ లు మరణించారు. మరో 7 గురు గాయపడగా ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయాన్ని మంత్రి శ్రీనివాస్ యాదవ్ సోమవారం తన కార్యాలయంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న, కలెక్టర్ శర్మన్ లతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంఘటన జరిగిన రోజే విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ కర్నాటక ప్రభుత్వంతో మాట్లాడి గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేలా చూడాలని చెప్పారని తెలిపారు. అంతేకాకుండా మానవతా దృక్పధంతో ఈ ప్రమాదంలో మరణించిన వారికి ఒక్కొక్కరికి 3 లక్షలు, గాయపడిన వారికి 50 వేల రూపాయలు చొప్పున ఇస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ÷ఎఖ్యమంత్రి చేసిన ప్రకటన మేరకు ప్రభుత్వం 24.50 లక్షల రూపాయలు మంజూరు చేయగా, ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురి కుటుంబాలకు రూ. 3 లక్షల చొప్పున, గాయపడ్డ ఏడుగురికి రూ. 50 వేల చొప్పున బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు.

# మోడీకి నిరసనలు తెలుపుదాం



(మొదటి పేజి తరువాయి) వారిని విడుదల చేయాలని కోరారు. శత్రువుల నుంచి దేశాన్ని కాపాడే జవానులను అవమనించేలా మోదీ సర్కారు వ్యవహరిస్తోందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. అగ్నిపథ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మల్గాజ్‌గిరి కూడలి వద్ద చేపట్టిన సత్యాగ్రహ దీక్షలో రేవంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులను, సైనికులను సమాజాన్ని నిర్మించే శక్తులుగా వారిని కాంగ్రెస్ గుర్తించిందన్నారు. అంబాని, ఆదాని కంపెనీల రక్షణకు అగ్నిపథ్ పథకాన్ని తెచ్చారని ఆరోపించారు. నాలుగేళ్ల సైన్యంలో ఆ తరువాత జీవిత కాలం బడా పారిశ్రామిక వేత్తలకు కాపలా కాయలా? అని ప్రశ్నించారు. అగ్నిపథ్‌తో ఉద్యోగ భద్రత లేదని, మాజీ సైనికుల హోదా లేదని, ఫించన్ కూడా లేదని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. అగ్నిపథ్ పథకంతో యువత భవిష్యత్తును చీకటి మయం చేస్తున్నారని మండిపడ్డారు. యువకులు నాలుగేండ్లు ఆర్మీలో పనిచేసి నిరుద్యోగిగా బయటకు వస్తే వాళ్ల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని.. ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా చట్టాలు తీసుకొచ్చి యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మార్చాయని ఆరోపించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో శాంతియుతంగా నిరసన తెలపడానికి వచ్చిన యువకులపై అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు.

# మోడీపై తెలంగాణ నుంచే తిరుగుబాటు



(మొదటి పేజి తరువాయి) రాష్ట్రపతి పదవీ బాధ్యతలు స్వీకరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్మ పట్ల వ్యక్తిగతంగా మాకు ఇబ్బంది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఆవిడ మంచి వ్యక్తే కావొచ్చు. గిరిజన, మహిళా అభ్యర్థిని చెప్పడం సరికాదు. జనవరి 2, 2006లో ఒడిశాలో కళింగనగర్‌లో స్టీల్ ప్లాంట్ వద్ద ఆందోళన చేస్తున్న 13 మంది గిరిజనులను కాల్చి చంపారు. అప్పటి ప్రభుత్వంలో బీజేపీ భాగస్వామి. ద్రౌపది నాడు మంత్రి కూడా. నాడు ఆమె ఎలాంటి సానుభూతి తెలుపలేదు. గిరిజనులకు అన్యాయం జరిగిందని ఒక్క మాట కూడా మాట్లాడలేదు. నిజంగానే గిరిజనులపై ప్రేమ ఉంటే.. తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసి పంపిన షెడ్యూల్డ్ తెగల రిజర్వేషన్లను పెంచాలని కోరుతున్నాం. ఒక వేళ నిజంగానే గిరిజనులపై ప్రేమ ఉంటే ఇప్పటి వరకు చేసి ఉండాలి. కానీ ఉలుకు పలుకు లేదు. ట్రైబల్ యూనివర్సిటీ పెడుతామని పునర్విభజన చట్టంలో చెప్పారు. ఈ రోజు వరకు అతీగతీ లేదు. తెలంగాణలోని ఏడు మండలాలను ఏపీలో కలిపారు. బీజేపీ వ్యవహారం దేశంలోని గిరిజనులకు, తెలంగాణలోని గిరిజనులకు బాగా తెలుసు. చిత్తశుద్ధి ఉంటే ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి. రిజర్వేషన్లను పెంచాలి. ఏడు మండలాలను తిరిగి వెనక్కి ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థి యశ్వంత్ సిన్హాకు టీఆర్ఎస్ మద్దతు ఉంటుందని మంత్రి కేటీఆర్ అన్నారు. బీజేపీకి గిరిజనుల మీద ప్రేమ లేదన్నారు. రాష్ట్రపతి అభ్యర్థి పేరుతో బీజేపీ నేతలు రాజకీయం చేయాలని చూస్తున్నారన్నారు. తాము ప్రతిపక్షాల కూటమిలో ఉన్నామని ఎవరు చెప్పారని ప్రశ్నించారు. బీజేపీకి వ్యతిరేకంగా విపక్షాల అభ్యర్థికి తాము మద్దతిచ్చామన్నారు. గిరిజనుల రిజర్వేషన్లు పెంచాలని చాలా సార్లు కేంద్రాన్ని కోరామని చెప్పారు. గిరిజన రిజర్వేషన్ల మీద తెలంగాణ అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని ఆమోదించాలన్నారు. గిరిజన వర్సిటీ ఇప్పటి వరకు లేదన్నారు. బీజేపీకి కేసీఆర్ బొమ్మ తప్ప వేరే దిక్కులేదన్నారు. మోడీ ఫోటోకు చెప్పులేసి గాడిద మీద ఊరేగించగలం కానీ అలా చేయబోమన్నారు. మోడీ మూడు సార్లు సీఎం అయినా గుజరాత్‌లో ఇంతవరకు కరెంట్ లేదన్నారు. ద్రౌపది ముర్మ సొంత గ్రామానికే ఇప్పుడు కరెంట్ ఇస్తున్నారన్నారు. అందరికి విద్యుత్ సౌకర్యం ఇచ్చామన్న మోడీ మాటలు అబద్ధమన్నారు. రాజ్యాంగాన్ని కాలరాసి మెజారిటీ లేకపోయినా ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. అయితే జుమ్లా..లేకుంటే హమ్లా మోడీ ఫార్ములా అని అన్నారు. తెలంగాణ నుంచే ధిక్కార స్వరం వినిపించి దేశాన్ని చైతన్యం చేయొచ్చాన్నారు. మోడీ 8 ఏళ్లలో తెలంగాణకు ఇచ్చింది ఏం లేదన్నారు. బీజేపీ కంటే గట్టిగా సమాధానం చెప్పే సత్తా టీఆర్ఎస్ కు ఉందన్నారు. తెలంగాణ ఇచ్చిన దాని కంటే కేంద్ర ఒక్క పైసా ఎక్కువ ఇచ్చినా రాజీనామా చేస్తానన్నారు. రామ్ నాథ్ కోవింద్ రాష్ట్రపతి అయ్యాక దళితుల బతుకులు ఏమైనా మారిపోయాయా అని ప్రశ్నించారు. విషం చిమ్ముడు తప్ప బీజేపీ నాయకుల దగ్గర విషయం లేదన్నారు. మీడియా సమావేశంలో ఎంపిలు నామా నాగేశ్వరరావు, కొత్త ప్రభాకర్ రెడ్డి,రంజిత్ రెడ్డి, బిబి పాటిల్,రాములు తదితరులు పాల్గొన్నారు.

# రాకేశ్ కుటుంబానికి 25లక్షల సాయం

(మొదటి పేజి తరువాయి) సమయంలో ఉద్యమకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని,మన సీఎం కేసీఆర్ తరహాలో దేశ వ్యాప్తంగా చనిపోయిన రైతులను ఆదుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా దబ్బీర్ పేట గ్రామాన్ని నేను దత్తత తీసుకుంటున్నట్టు మంత్రి ఎర్రబెల్లి ప్రకటించారు. గ్రామ అభివృద్ధి నా బాధ్యత అని, దబ్బీర్ పేట లో వివిధ అభివృద్ధి పనులకు 50 లక్షలు మంజూరు చేస్తున్న తెలిపారు.కేవ్ లా తండాకు 20 లక్షలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు.దళిత బంధు, ఇండ్లు వంటి ఏ పథకాలు వచ్చినా దబ్బీర్ పేట కు అధిక ప్రాధాన్యం ఇస్తానని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే, వరంగల్ జిల్లా టీఆరెఎస్ అధ్యక్షుడు ఆరూరీ రమేశ్, జిల్లా కలెక్టర్ గోపి, ఆర్డీఓ, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ సర్పంచ్, రాకేశ్ కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

(మొదటి పేజి తరువాయి) ఫలితాలపై అధికారికంగా ఇంటర్ బోర్డు ఒక ప్రకటనను విడుదల చేసింది. ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులు గత కొన్నిరోజులుగా ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే పలు కారణాల వల్ల ఫలితాల తేదీ వాయిదా పడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో 28న ఉదయం 11గంటలకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షల ఫలితాలు విడుదల చేస్తామని ఇంటర్మీడియట్ బోర్డు తెలిపింది. ఫలితాలు విడుదలైన వెంటనే అధికారిక వెబ్ సైట్ ద్వారా ఫలితాలను చెక్ చేసుకోవచ్చు.

# ప్రసాదం ప్యాకెట్లపై తయారీ తేదీ ఏదీ

## తూనికల శాఖకు ఫిర్యాదు




**హైదరాబాద్, జూన్ 27 (అక్షర వెలుగు):** చినజీయర్ ఆధ్వర్యంలోని సమతామూర్తి ఆశ్రమానికి సంబంధించి ఓ కొత్త వివాదం వెలుగులోకి వచ్చింది. ఆశ్రమంలో భక్తులకు విక్రయించే ప్రసాదం ప్యాకెట్లపై తయారీ తేదీ, ఎక్స్‌పైరీ డేట్ ముద్రించలేదంటూ ఓ వ్యక్తి తూనికలు కొలతల శాఖకు ఫిర్యాదు చేశారు. ప్యాకెట్‌పై పేర్కొన్న బరువుకు, లోపలి ప్రసాదం బరువుకు మధ్య తేడా ఉందంటూ వినయ్ వంగాల ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందించాడు. దీంతో.. అధికారులు ఆశ్రమంలో తనిఖీలు చేపట్టి మెట్రాలజీ చట్టం 2009లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. చట్టంలోని సెక్షన్లు 10,11,12తో పాటూ 8/25 నిబంధన కింద కేసు నమోదైనట్టు వినయ్ వంగాల తెలిపారు. అయితే.. అధికార యంత్రాంగం ఈ ఫిర్యాదుపై వేగంగా స్పందించి కేసు దాఖలు చేయడం ప్రస్తుతం పెద్ద చర్చకు దారితీస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, చినజీయర్‌కు మధ్య విబేధాలున్నట్టు కొంతకాలంగా వార్తలు వెలువడుతున్న విషయం తెలిసిందే. ప్రధాని మోదీ హాజరైన సమతామూర్తి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ గైర్హాజరవడం..ఈ వార్తలకు బలం చేకూర్చినట్లైంది. అయితే.. తనకు ఎవరితోనూ విబేధాలు లేవని చినజీయర్ స్వామి అప్పట్లోనే తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఆశ్రమ నిర్వాహకులపై ప్రసాదం విషయంలో కేసు దాఖలవడం ప్రజల్లో మరోసారి చర్చకు తావిచ్చింది.

# దక్షిణాది నుంచి ఎదిగిన తొలి తెలుగు ప్రధాని

## భూసంస్కరణలతో ఇందిరను ఆకట్టుకున్న మేధావి



**హైదరాబాద్, జూన్ 27 (అక్షర వెలుగు):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తెలంగాణ నుంచి ఎంపికైన తొలి ముఖ్యమంత్రిగా తెలుగు జాతి అంతా సగర్వంగా చెప్పుకునేలా దక్షిణ భారతదేశం నుంచే ప్రధాని పదవిని అధిష్ఠించిన మొట్టమొదటి వ్యక్తిగా పీవీ నరసింహారావు రాజకీయాల్లో ప్రత్యేక స్థానం పొందారు. ఒక్క రాజకీయ రంగమే కాదు, సాహిత్యంలోనూ ఆయన సృజన ఎంతో గొప్పది.. కవిగా, కథకునిగా, నవలా రచయితగా, నాటక కర్తగా, అనువాద రచయితగా, విమర్శకునిగా ఆయన విశ్వరూపం బహుముఖం. పద్దెనిమిది భాషలలోఆయన పాండితీ ప్రకర్ష కలిగిన వారు. అర్థశాస్త్రంలో ఎంత పట్టుందో, ఆధ్యాత్మిక విషయాలలోనూ అంతే పట్టుంది. ఈ శతాబ్ది దేశ చరిత్రలో ఇంతటి విశిష్ట విలక్షణ, బహుముఖ ప్రతిభాశాలి పీవీ ఒక్కరే. మనజాతి గౌరవాన్ని,ఆత్మగౌరవాన్ని అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పిన తెలంగాణ విలక్షణ నేత దివంగత పివి నరసింహారవు. పీవీ జీవితం తెరిచిన పుస్తకం లాంటిది. సామాన్యుడు మాన్యునిగా ఎదగడం అన్నది పివికి మాత్రమే దక్కిన అరుదైన అదృష్టంగా చూడాలి. పీవీ రాజకీయ ప్రస్థానం 1952 జనరల్ ఎలక్షన్లతో మొదలైంది. అలా 1962లో నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో తొలిసారి న్యాయశాఖ, జైళ్లు, సమాచారశాఖ మంత్రిగా చేరి తన సంస్కరణల పర్వానికి తెరదీశారు. తదుపరి దేవాదాయ శాఖ వైద్య ఆరోగ్య శాఖ, విద్యామంత్రిత్వ శాఖలను సమర్థంగా నిర్వహించారు. పీయూసీకి బదులు మళ్లీ ఇంటర్మీడియట్‌ను తెలుగు మీడియంతో ప్రవేశపెట్టడమే కాదు, తెలుగు అకాడమికి రూపకల్పన చేసారు.1969లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రోద్యమ సెగవల్ల కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయగా, 1971లో పీవీ ముఖ్యమంత్రిగా నియుక్తులయ్యారు. 1972 అసెంబ్లీ ఎన్నికల్లో పీవీ భారీ మెజారిటీ సాధించి భూ సంస్కరణల చట్టాన్ని ప్రవేశపెట్టి విప్లవాత్మక మార్పులకు నాంది పలికారు. అయితే తెలంగాణలోని భూస్వాములకు పీవీ సంస్కరణలు నచ్చక, ఆయనకు వ్యతిరేకంగా కేంద్రంలో హై కమాండ్‌ను కలిసి, పీవీ వల్ల పార్టీకి నష్టం వాటిల్లుతుందని ప్రచారం చేశారు. అయితే భూ సంస్కరణలు ఆవశ్యకతను సోదాహరణంగా వివరించి ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీని మెప్పించారు. 1970లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ముల్కీ నిబంధనలు చెల్లుతాయని ఇచ్చిన తీర్పును, 1972 ఫిబ్రవరి 4న హైకోర్టు ధర్మాసనం రద్దు చేయటంతో ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఉద్యమం మొదలైంది. అది రాను రాను పీవీ వ్యతిరేక ఉద్యమంగా మారటంతో 1973 జనవరి 17న పీవీ ప్రభుత్వం రాజీనామా చేసింది. దాంతో పీవీ శకం ముగిసిందని, పీవీ వ్యతిరేక వర్గం సంతోషించింది. భూ సంస్కరణల చట్టం తెచ్చి పీవీ ముఖ్యమంత్రిగా విఫలమయ్యాడని చాలామంది ప్రచారం చేశారు. ఆంధ్రోద్యమం వల్లనే పీవీ రాజీనామా చేయాల్సి వచ్చింది. అనంతరం రాష్ట్రపతి పాలనే విధించారుగానీ పీవీ బదులు వేరే ముఖ్యమంత్రిని నియమించలేదు. కాని వారి సంతోషం ఎంతో కాలం నిలువలేదు. పీవీ వంటి మేధావి సేవలు రాష్ట్రస్థాయి కన్న అఖిల భారత స్థాయిలోనే అవసరమని భావించి, ఇందిరాగాంధీ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేత ఘటనతో పీవీని రాజకీయంగా దూరం చేయడానికి కొందరు అవకాశంగా వాడుకోవాలనుకున్నారు. నట్వర్‌సింగ్, అర్జున్‌సింగ్, ఎన్డీ తివారీ ప్రభృతులు ఇందులో ఉన్నారు. పీవీతో రాజీనామా చేయించడానికి వారు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మొత్తానికి ఐదేండ్ల కాలంలో పీవీ దేశానికి సుస్థిర ప్రభుత్వాన్ని, పాలనను ఇచ్చారు. అంతేకాదు అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్ఠను ఇనుమడింప చేశారు.మహారాష్ట్రలో ఉండగా గోపాల కృష్ణ గోఖలె ప్రభృతుల ఉపన్యాసాలు, మహారాష్ట్రలో వీరసావర్కర్ ప్రబోధాలు అక్కడి సంస్కృతి పీవీ జీవిత లక్ష్యాన్ని స్వాతంత్ర్యోద్యమం వైపు మరల్చాయి. ఆ సమయంలో మరాఠి కన్నడ భాషల్లో పట్టుసాధించిన పీవీ హరినారాయణ్ ఆప్టె రచనలు, సంత్ తుకారాం అభంగాలు చదివి అనువాదాలకు ఉపక్రమించారు. బీఎస్సీ యూనివర్సిటీ ఫస్ట్‌గా నిలిచిన పీవీ నాగపూర్ యూనివర్సిటీలో లా చదివి, న్యాయవిద్యలోనూ సర్వోన్నత శ్రేణి సాధించారు. అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం పీవీ ప్రతిభను ప్రశంసించి, జుడిషియల్ సర్వీస్‌లో చేరాలని ఆహ్వానించగా తిరస్కరించి, హైదరాబాద్‌కు తిరిగివచ్చారు. నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభల నిర్మాతలలో ప్రముఖంగా పేర్కొనదగిన బూర్గుల రామకృష్ణారావు వ్యక్తిత్వం పీవీని ఆకర్షించింది. ఆయన వద్ద జూనియర్‌గా చేరి న్యాయవాద వృత్తిని కొంతకాలం కొనసాగించారు. స్వామి రామానంద తీర్థ పిలుపునందుకొని వకాలత్ వృత్తికి స్వస్తి చెప్పి హైదరాబాద్ రాష్ట్ర స్వాతంత్య సమరంలో పాల్గొన్నారు.

# గజ్వేల్ రైల్వే స్టేషన్‌లో రేక్ పాయింట్


దశాబ్దాల పోరాట ఫలితం అన్న మంత్రి హరీష్

రేక పాయింట్‌తో ఈ ప్రాంతానికి మేలన్న మంత్రి నిరంజన్



**గజ్వేల్, జూన్ 27 (అక్షర వెలుగు):** గజ్వేల్ రైల్వే స్టేషన్ కేంద్రంగా ఏర్పాటు చేసిన రేక్ పాయింట్‌ను రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్సీలు ఫారూఖ్ హుస్సేన్, యాదవరెడ్డి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. తొలి విడతలో ఏపీలోని కాకినాడ ఎన్ఎఫ్‌సీఎల్ నుంచి 21 బోగీల్లో 1300 మెట్రిక్ టన్నుల ఎరువులు గజ్వేల్ స్టేషన్‌కు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఉమ్మడి మెదక్ జిల్లా దశాబ్దాల పోరాటం ఫలితంగా రేక్ పాయింట్ ఏర్పాటైందని పేర్కొన్నారు. ఈ రేక్ పాయింట్ జిల్లా ప్రజలకు వరం అని చెప్పారు. కేంద్రానిదే రైల్వే లైన్ బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ రైల్వే లైన్ కోసం నాటి సీఎంలు కిరణ్ కుమార్ రెడ్డి, రోశయ్య నిధులు ఇచ్చేవారు కాదని గుర్తు చేశారు. కానీ తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్ర ప్రభుత్వం మూడో వంతు నిధులను ఎప్పటికప్పుడు ఇచ్చిందని తెలిపారు. కొత్తపల్లి- మనోహరబాద్ రైల్వే లైన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 600 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఈ లైన్ కోసం 2,200 ఎకరాల భూసేకరణ చేశామని హరీశ్‌రావు తెలిపారు. ప్రజల ఊహలకు అందనిది, కలలో కూడా ఉహించని అభివృద్ధి టీఆర్ఎస్ హయాంలో జరుగుతున్నదని మంత్రి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ రైల్వే స్టేషన్లో ఎరువుల రేక్ పాయింట్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అనేక రకాల ఎగుమతుల సౌలభ్యం ఈ రేక్ పాయింట్ ద్వారా అందనుందన్నారు. రాబోయే వందల సంవత్సరాల వరకూ ప్రజల అవసరాలు తీర్చే పనులు జరుగుతున్నాయన్నారు. సీడ్ పాయింట్‌గా గజ్వేల్ అభివృద్ధి చెందుతున్నదని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో ఉన్న రెండు జాతీయ పార్టీలు దేశాన్ని ఎన్ని ఏళ్ళు ఏలినా తెలంగాణకు ఒరిగిందేమి లేదన్నారు. ఈ రోజు కేంద్రాన్ని ఏలుతున్న పార్టీ వరి సాగులో, వడ్ల కొనుగోలులో అత్యంత బాధ్యతారహితంగా వ్యవహరించిందని విమర్శించారు. వరికి ప్రత్యామ్నాయంగా పత్తి, పప్పు దినుసులు, ఆయిల్ పామ్ సాగుకు రైతులు మొగ్గు చూపాలన్నారు. ల్గ÷తులకు, ప్రభుత్వానికి ఇబ్బందులు కలిగించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని మంత్రి నిరంజన్‌రెడ్డి విమర్శించారు.

# జై జవాన్.. జై కిసాన్ అన్నదే కాంగ్రెస్ నినాదం జగ్గారెడ్డి




**సంగారెడ్డి, జూన్ 27 (అక్షర వెలుగు):** ఆర్మీని అదానీకి అప్పజెప్పే కుట్ర జరుగుతోంది కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆరోపించారు. ఇప్పటికే దేశంలోని ప్రభుత్వ ఆస్తులను అంబానీ, అదానీలకు కట్టబెడుతున్న మోదీ ఇప్పుడు ఆర్మీపై పడ్డారని విమర్శించారు. ఆర్మీలో నాలుగేళ్లు పనిచేసి వచ్చాక అడ్డుక్కుని తినాలా? అని ఆయన ప్రశ్నించారు. జై జవాన్.. జై కిసాన్ అన్నదే కాంగ్రెస్ నినాదం జగ్గారెడ్డి పేర్కొన్నారు. అగ్నిపథ్‌ను రద్దు చేసేవరకు పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని యువత భవిష్యత్ తో చెలగాటమాడవద్దని ఎమ్మెల్యే జగ్గారెడ్డి హితవు చెప్పారు.

# పోడు సమస్యలు ఏమయ్యాయి: రేణుక



**హైదరాబాద్, జూన్ 27 (అక్షర వెలుగు):** పోడు భూముల సమస్యపై కేసీఆర్ హామీ ఏమైంది? అని కాంగ్రెస్ సీనియర్ నేత రేణుకాచౌదరి ప్రశ్నించారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న మహిళలపై పోలీసుల దాడులు సమంజసం కాదన్నారు. డిపార్ట్‌మెంట్‌కు చెప్పేదొకటి.. ఆయనిచ్చే స్టేట్‌మెంట్ మరొకటని మండిపడ్డారు. గిరిజన మహిళలపై దాడులు చేసి సమస్య పెండింగ్ పెడుతున్నారని చెప్పారు. తెలంగాణ రైతులకు చేసిందేమీ లేదు కానీ.. పొరుగు రాష్ట్రాల్లో రైతులకు డబ్బులు ఇస్తున్నారని ఆమె ఆరోపించారు.

# సొంతపార్టీ నేతలే కుట్రచేస్తున్నారు




మాజీమంత్రి బాలినేని మండిపాటు

**ఒంగోలు, జూన్ 27 (అక్షర వెలుగు):** మాజీ మంత్రి బాలినేని సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై సొంత పార్టీ నేతలే కుట్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. వ్యక్తిగతంగా తనను టార్గెట్ చేస్తున్నారని చెప్పారు. తనను ఎవరు టార్గెట్ చేస్తున్నారో తెలుసని.. వాళ్ల సంగతి చూస్తానని హెచ్చరించారు. తనపై ఆరోపణలు చేస్తున్నవారితో టీడీపీ నేతలు టచ్‌లో ఉన్నారని ఆరోపించారు. పవన్ రిక్వెస్ట్ చేస్తేనే జనసేనవారిపై కేసులు ఉపసంహరించుకున్నానని తెలిపారు. తప్పు చేసినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. అలాగే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని స్పష్టం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, దీని వెనుక టీడీ జనార్ధన్ కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. నిన్న చెన్నైలో పట్టుబడ్డ డబ్బుపై మరోసారి దుష్ప్రచారం చేశారన్నారు. తన కుటుంబంపై కుట్ర జరుగుతోం దన్నారు. ఇకనైనా వారు పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. తప్పు చేసినట్లు నిరూపిస్తే పదవి నుంచి తప్పకుంటానని బాలినేని సవాల్ విసిరారు.

# పివి చొరవతో విద్యారంగంలో సంస్కరణలు

## నవోదయ విద్యాలయాలతో మారిన రంగం



**హైదరాబాద్, జూన్ 27 (అక్షర వెలుగు):** రాజీవ్ గాంధీ ప్రధానమంత్రులుగా ఉన్న రోజుల్లో జాతీయ విద్యా విధానం రూపొందించిన మహా విద్యావేత్త మన పివి నరసింహారావు. ఒక విద్యావేత్తగా తత్త్వవేత్తగా, ఆర్థిక వేత్తగా, సామాజిక వేత్తగా, రాజకీయవేత్తగా, భాషావేత్తగా, అభ్యుదయ వేత్తగా ఇలా బహుముఖ ప్రజ్ఞాశీలిగా పీవీ ఘనమైన చరిత్ర కలిగిన మహోను భావుడు. అందుకే తనకు ఏ మంత్రిపదవి అప్పగించినా అందులో రాటుదేలడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. అందుకే నవోదయ విద్యావిధానం ఆయన బుర్రలోంచి బయటకు వచ్చింది. పివి నర్సింహారావు కేంద్రంలో మానవ వనరుల మంత్రిగా ఉన్నప్పుడు విద్యారంగానికి ఎనలేని సేవలు అందించారు. అనేక కార్యక్రమాలను అమలు చేశారు. పీవీ మేధో సంపత్తి గురించి ఆయనను అనుసరించిన వారందరికీ తెలుసు. ఎప్పుడూ సమాజం గురించి ఆలోచించే దార్శనికుడని ఆయనతో పనిచేసిన వారు ఎదుగుదురు. అందుకే ఆయన నవోదయాలను తమకూ కావాలని ఇప్పటికీ అనేక రాష్ట్రాలు కోరుతున్నాయి. ఉమ్మడి అంధ్రప్రదేశ్‌లో విద్యాశాఖ మంత్రిగా పేదలకు రెసిడెన్షియల్ విద్యావ్యవస్థను తొలిసారిగా పరిచయం చేసిన ఘనత ఆయనదే. అందులో నవోదయ విద్యాలయాల ఏర్పాటు కూడా ఒకటి. ఇప్పుడు నవోదయలో చదివిన విద్యార్థులు అన్నిరంగాల్లో రాటుదేలుతున్నారు. దీనిని జాతీయస్థాయిలో ప్రవేశ పెట్టిన ఘనత కూడా ఆయనదే. ఇందిరా గాంధీ, ప్రాచీన గ్రీకు తాత్వికుడు ప్లేటో చెప్పినట్లు తత్త్వవేత్తలే పాలనలో న్యాయాన్ని ధర్మాన్ని సమానంగా స్వీకరిస్తారని అంటారు. గీతాచార్యుడు కూడా అలగా అంటాడు. స్థితప్రజ్ఞత ఉంటే ఏదైనా సాధించగలరని. అర్థశాస్త్ర రచయిత కౌటిల్యుడి అభిప్రాయం ప్రకారం మంచి, చెడు రెండింటినీ ఒకే కోణంలో చూసినప్పుడు మంచి నాయకుడు కాగలడు. ఆయన రూపకల్పన చేసిన ప్రైవేటీకరణ, ఆర్థిక సరళీకరణ విధానాలను తదనంతర ప్రభుత్వాలు కొనసాగించలేకపోయాయి. సమైక్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, యాభై సంవత్సరాల క్రితం భూసంస్కరణలను ప్రవేశపెట్టిన ఘనత పీవీ సొంతం. పీవీ తీసుకువచ్చిన భూసంస్కరణలు భూస్వామ్య వ్యవస్థను సమూలంగా నిర్మూలించడానికి బాటలు వేశాయి. భూమిలేని పేదలు చిన్న-చిన్న కమతాల యజమానులుగా మారడానికి సహాయపడ్డాయి. పేద వారికి సమాజంలో గౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చాయి. దున్నేవారికే భూమి ఎందుకు ఇవ్వాలో పీవీ సవివరంగా తెలియచెప్పారు. రాజకీయాల నుండి దాదాపు తప్పుకుంటున్న దశలో అనుకోకుండానే పివి ప్రధాని అయ్యారు. నెహ్రూ-గాంధీల కుటుంబానికి చెందని, పూర్తి అయిదు సంవత్సరాల పాటు ప్రధానిగా పనిచేసిన మొదటి వ్యక్తి పీవీ. తీరికలేని రాజకీయ కార్యకలాపాలు ఉన్నప్పటికీ, అన్ని భాషలలోని ప్రముఖ రచయితలతో పీవీ క్రమం తప్పకుండా సంబంధాలు కొనసాగించారు. ఆయన 18 భాషలలో నిష్ణాతులు. స్థితప్రజ్ఞతకి, మూర్తీభవించిన వ్యక్తిత్వానికి నిలువెత్తు నిదర్శనం. పి.వి ఎంత ఎదిగినా, ఎంత పాండితీవిభవ సంపన్నులైనా వినమ్రత ఆయన సొత్తు.

# ప్రగతి భవన్ ముట్టడికి బయల్దేరిన గిరిజనులు

- జిల్లాలోనే అడ్డుకుని అరెస్టు చేసిన పోలీసులు



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 27 (అక్షర వెలుగు):** పోడు భూముల సమస్యల పరిష్కారం కోరుతూ ప్రగతి భవన్ ముట్టడికి పాదయాత్రగా బయలుదేరిన గిరిజనులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలం రామన్నగూడెం పరిధిలో సోమవారం జరిగింది. గతంలో సర్వే నెంబర్ 30, 36, 39లలో ఉన్న 570 ఎకరాల భూమికి సంబంధించి గిరిజనులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు గిరిజనులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో అధికారులు గిరిజనులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారు. అయితే, ఏళ్లు గడుస్తున్నా భూమికి సంబంధించి పొజిషన్ చూపించలేదు. రామన్నగూడెం పంచాయతీ పరిధిలో గిరిజనులు 40 ఏళ్లుగా అటవీ ప్రాంతంలో పోడు భూములు సాగు చేసుకుంటున్నారు. 2012లో పోడు భూములపై ఫారెస్టు, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ అధికారులు సర్వే నిర్వహిచారు. అయితే, అధికారులు ఈ సర్వే రిపోర్టును ఉన్నతాధికారులకు సమర్పించలేదు. దీంతో భూమిపై వివాదం నెలకొంది. దీంతో ఇంతకాలంగా భూమి కోసం గిరిజనులు పోరాటం చేస్తున్నారు. ఎంతోకాలంగా భూమి హక్కుల కోసం పోరాడుతన్నప్పటికీ, తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని, సీఎం కేసీఆర్‌ను కలిసి గోడు వెళ్లబోసుకో వాలని గిరిజనులు నిర్ణయించుకున్నారు. దీనికోసం గిరిజనులు ఛలో ప్రగతి భవన్‌కు పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వర రావు, అశ్వారావు పేట ఎంపీపీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఛలో ప్రగతి భవన్‌లో భాగంగా రామన్న గూడెం నుంచి గంగారాం వరకు గిరిజనులు పాదయాత్ర చేపట్టారు. గంగారాం వద్ద పోలీసులు వీరిని బలవంతంగా అరెస్టు చేశారు. అనంతరం దమ్మపేట, ముల్కలపల్లి పోలీసు స్టేషన్లకు తరలించారు. అక్కడి నుంచి పాల్వంచ పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారు. కాగా, పాదయాత్ర చేస్తున్న గిరిజనుల అరెస్టుకు నిరసనగా, స్థానికులు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్నారు. ఈ ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు కూడా పాల్గొన్నారు. పోడు భూముల హక్కుల కోసం పోరాడుతున్న గిరిజనుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని తాటి వెంకటేశ్వర్లు అన్నారు.

# నేటినుంచి రైతుబంధు డబ్బులు జమ



68.10లక్షల మంది రైతులు అర్హులుగా గుర్తింపు

వ్యవసాయ మంత్రి నిరంజన్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, జూన్ 27 (అక్షర వెలుగు):** తెలంగాణలో రైతుబంధు నిధులునేటినుంచి జమకానున్నాయి. సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రైతుబందు కింద 68.10 లక్షల మంది అర్హులుగా తేలినట్టు వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీ నుండి రైతుబంధు నిధులు రైతుల ఖాతాలలో జమకానున్న నేపథ్యంలో మంత్రి నిరంజన్ రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ దఫా కోటి 50 లక్షల 43 వేల 606 ఎకరాలకు రైతుబంధు సాయం అందనున్నదని తెలిపారు. పంపిణీకి రూ.7521.80 కోట్లు సిద్ధంగా వున్నాయని తెలిపారు. రోజుకు ఒక ఎకరా నుండి ఆరోహణా క్రమంలో రైతుల ఖాతాలలో జమ చేయనున్నట్లు మంత్రి చెప్పారు. సీసీఎల్‌ఏ వ్యవసాయ శాఖకు వివరాలు అందించినట్టు తెలపారు. వ్యవసాయ శాఖ అధికారులు ఎకరాల వారీగా బిల్లుల జాబితా రూపొందించి ఆర్థికశాఖకు అందించారని అన్నారు. వానాకాలం రైతుబంధు నిధుల పంపిణీకి అంతా సిద్ధం చేశామనని తెలిపారు. మొదటిసారి రైతుబంధు తీసుకునే రైతులు వెంటనే క్షేత్రస్థాయిలో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను కలిసి పట్టాదార్ పాసుబుక్కు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు అందించి నమోదు చేసుకోవాలని సూచించారు. కేంద్రం ఎన్ని ఆర్థికపరమైన అడ్డంకులు సృష్టించినా రైతుల మీద అభిమానంతో ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు నిధుల విడుదలకు ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పత్తి, కంది ఇతర అపరాలు, నూనెగింజల పంటల సాగుపై రైతులు దృష్టిసారించాలని మంత్రి సూచించారు. జులై 15వ తేదీ వరకు పత్తి విత్తుకునే అవకాశం ఉన్నందున రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వర్షాలు కొంత ఆలస్యమయినందున తేలిక నేలలలో 5 నుండి 6.5 సెంటిమీటర్లు, బరువు నేలలలో 6 నుండి 7.5 సెంటిమీటర్ల వర్షాపాతం నమోదు అయిన తర్వాతనే రైతులు వర్షాధార పంటలను విత్తుకోవాలన్నారు.

# గ్యాంగ్ రేప్ కేసుల్లో దర్యాప్తు ముమ్మరం

నిందితుల డిఎన్‌ఏ సేకరణకు కోర్టు అనుమతి

**హైదరాబాద్, జూన్ 27 (అక్షర వెలుగు):** జూబ్లీహిల్స్ గ్యాంగ్‌రేప్ కేసు నిందితుల డీఎన్‌ఏ సేకరణను కోర్టు అనుమతి ఇచ్చింది. బాలికపై సామూహిక అత్యాచారం కేసులో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితుల డీఎన్‌ఏ సేకరించడానికి పోలీసులు కోర్టును అనుమతికోరగా న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నిందితుల నుంచి పోలీసులు డీఎన్‌ఏ సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్?కు పంపనున్నారు. ఇప్పటికే.. అత్యాచారం జరిగిన ఇన్నోవా కారులో ఆధారాలు సేకరించారు. డీఎన్‌ఏ సేకరించిన తర్వాత వాహనంలోని ఆధారాలతో పోల్చనున్నారు. నిందితులు ఇన్నోవా వాహనంలోనే ఉన్నట్లు శాస్త్రీయంగా నిరూపించడానికి డీఎన్‌ఏ టెస్ట్ ఉపయోగపడుతుందని పోలీసులు భావిస్తున్నారు. అవసరమైతే బాధితురాలి డీఎన్‌ఏను సేకరించే యోచనలో ఉన్నారు. మే 28న మైనర్ బాలికను సాదుద్దీన్ సహా మరో ఐదుగురు యువకులు అత్యాచారం చేశారు. ఈ కేసులో ఐదుగురు మైనర్లతో పాటు ప్రధాన నిందితుడు సాదుద్దీన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం అందర్ని కొన్ని రోజుల పాటు రిమాండ్‌లో ఉంచి విచారించారు. ప్రస్తుతం సాదుద్దీన్ చంచల్‌గూడ జైల్లో ఉండగా.. ఐదుగురు మైనర్లు జువైనల్ హోంలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

# విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థిగా యశ్వంత్ నామినేషన్

(మొదటి పేజి తరువాయి) టీఎంసీ, డీఎంకే ఎంపీలు తదితరులు పాల్గొన్నారు. నామినేషన్‌కు ముందు.. సిన్హాను బలపరుస్తున్న పార్టీల నేతలంతా రాజ్యసభ సెక్రటరీ జనరల్ కార్యాలయం వద్ద సమావేశమయ్యారు. రాష్ట్రపతి ఎన్నిక.. ఇద్దరు వ్యక్తుల మధ్య పోటీ కాదని, రెండు సిద్ధాంతాల మధ్య జరిగే పోరు అని పలువురు ప్రతిపక్ష పార్టీ నాయకులు అన్నారు. ఓవైపు ఆర్ఎస్ఎస్‌పై ద్వేషం, మరోవైపు అన్ని విపక్షాల కరుణ అనే రెండు సిద్ధాంతాల మధ్యే అసలైన పోరాటం జరుగుతుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. యశ్వంత్ సిన్హాను ఉత్తమ అభ్యర్థిగా తాము భావిస్తున్నామని, అందుకే టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ మద్దతు పలుకుతున్నారని ఆ పార్టీ ఎంపీ సౌగతా రాయ్ తెలిపారు. అత్యున్నత విలువలతో ఉన్న కూటమి తమదని ఆయన చెప్పారు. తాము ఎన్డీఏ అభ్యర్థి ద్రౌపదీ ముర్ముకు గౌరవిస్తా మని, కానీ ఎన్నికల్లో మాత్రం యశ్వంత్ సిన్హాకు మద్దతిస్తామని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. విపక్షాల రాష్ట్రపతి అభ్యర్థిగా నామినేషన్ వేసిన యశ్వంత్ సిన్హాకు పలు పార్టీలు మద్దతు తెలిపాయి. కాంగ్రెస్, తెరాస, సీపీఐ, సీపీఎం, ఎన్సీపీ, ఎస్పీ, డీఎంకే, ఆర్జేడీ, ఆర్?ఎల్డీ, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీలు సిన్హాకు అండగా నిలిచాయి. యశ్వంత్ సిన్హా బిహార్ పట్నాలో 1937 నవంబర్ 6న జన్మించారు. 1958లో యూనివర్సిటీ ఆఫ్ పట్నాలో పొలిటికల్ సైన్స్?లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. అక్కడే 1962 వరకు ప్రొఫెసర్?గా పనిచేశారు. 1960లోనే సిన్హా ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. 24 ఏళ్ల పాటు సేవలందించారు. పలు కీలక పదవులు చేపట్టారు. అనంతరం 1984లో జనత పార్టీ ద్వారా రాజకీయ ప్రవేశం చేశారు. 1986లో పార్టీ ఆల్ ఇండియా జనరల్ సెక్రెటరీగా నియమితులయ్యారు. 1988లోనే రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1989లో జనతాదళ్ ఏర్పాటయ్యాక ఆ పార్టీకి జనరల్ సెక్రెటరీగా నియమితులయ్యారు. అప్పటి ప్రధాని చంద్రశేఖర్ కేబినెట్?లో 1990 నవంబర్ 1 నుంచి 1991 జూన్ వరకు ఆర్థిక మంత్రిగా పనిచేశారు. భాజపా ఏర్పాటయ్యాక 1996లో పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా యశ్వంత్ సిన్హా నియమితు లయ్యారు. 1998, 1999, 2009లో హజారీబాగ్ లోక్ సభ నియోజకవర్గం నుంచి భాజపా తరపున పోటీ చేసి గెలుపొందారు. 1998-2022 మధ్య కాలలో అటల్‌బిహారీ వాజ్‌పేయీ హయాంలో ఆర్థిక మంత్రిగా సేవలందించారు. 2002-2004 మధ్య విదేశీ వ్యవహారాల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. అభ్యర్థిగా భాజపాలో ఉంటూనే సొంతపార్టీపై గళమెత్తిన అతికొద్దిమంది నేతల్లో యశ్వంత్ సిన్హా ఒకరు. పలుమార్లు ప్రధాని నరేంద్ర మోదీపై బహిరంగంగా విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో 2018లో పార్టీ ఉపాధ్యక్ష పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి బయటకు



వచ్చారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని మోదీ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. ఆ తర్వాత బంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2021 మార్చి 13న మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీలో యశ్వంత్ సిన్హా చేరారు. మార్చి 15న పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఇప్పుడు రాష్ట్రపతి రేసులో ఉంటున్నందున పార్టీకి రాజీనామా చేసి బయటకు వచ్చారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న యశ్వంత్ సిన్హాకు అన్ని పార్టీలతోనూ సత్సంబంధాలు ఉన్నాయి. దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు ఐఏఎస్ అధికారిగా సేవలందించిన అనుభవం ఉంది. అందుకే ఆయనే రాష్ట్రపతి అభ్యర్థికి సరైన వ్యక్తి అని భావించి విపక్షాలు ఏకాభిప్రాయంతో ఆయన పేరును ఖరారు చేశాయి.

# పోలీస్ వాహనం బోల్తా: 8మందికి గాయాలు





**యాదాద్రి భువనగిరి, జూన్ 27 (అక్షర వెలుగు):** పోలీసుల వాహనం బోల్తా పడటంతో ఎనిమిది మంది గాయపడ్డారు. ఈ సంఘటన బీబీనగర్ మండలం కొండమడుగు మెట్టు సమీపంలోని ఎయిమ్స్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని తెలంగాణ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ నుంచి పోలీసు వాహనం వరంగల్‌కు వెళ్తుంది. బీబీనగర్ వద్దకు రాగానే ముందుగా వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాద సమయంలో వాహనంలో 8 మంది ఉన్నారు. విషయం తెలిసిన బీబీనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుకొని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




# చలన చిత్రం

## అల్లు అర్జున్‌పై నార్త్ ఆడియన్స్ ట్రోల్
## సోషల్ మీడియా వేదికగా బన్నీ అభిమానుల రిప్లై



ప్రస్తుతం బాలీవుడ్ పై సౌత్ సినిమా డామినేషన్ కొనసాగుతోంది. అయితే దీన్ని జీర్ణించుకోలేని కొందరు నార్త్ ఆడియన్స్ మరియు అక్కడి స్టార్స్ దక్షిణాదిపై అక్కసు వెళ్లగక్కుతున్నారు. మన హీరోలను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో నెగెటివ్ కామెంట్స్ చేస్తున్నారు. ఆ మధ్య యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ లుక్ మరియు స్టైలింగ్ గురించి ట్రోల్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు లేటెస్టుగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ను లక్ష్యంగా చేసుకొని నెట్టింట ట్రోల్స్ చేస్తున్నారు. ఇటీవల బన్నీ ముంబైకి వెళ్లిన సందర్భంలోని కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇందులో అతను బ్లాక్ ప్యాంటుతో ప్రింటెడ్ టీ-షర్ట్ లో పుష్పరాజ్ అవతార్ లో కనిపించాడు. కాకపోతే వీటిల్లో నార్మల్ గా కంటే కొంచెం భారీగా కనిపిస్తున్నాడు.దీంతో అల్లు అర్జున్ లుక్ పై బాలీవుడ్ జనాలు నెగిటివ్ కామెంట్స్ చేయడం ప్రారంభించారు. కొందరు మోటా భాయ్ అని ట్రోల్ చేస్తుంటే.. మరికొందరు వడా పావ్ లుక్ అంటూ వ్యాఖ్యానిస్తున్నారు. అయితే వీరికి టాలీవుడ్ సినీ అభిమానులు మరియు బన్నీ ఫ్యాన్స్ స్ట్రాంగ్ గా కౌంటర్లు ఇస్తున్నారు. వడా పావ్ తింటూ బాలీవుడ్ స్టార్స్ టాలీవుడ్ లో ప్రమోషన్స్ చేసుకుంటున్నారని.. అదే సమయంలో అల్లు అర్జున్ ఎలాంటి పబ్లిసిటీ చేయకుండానే 'పుష్ప' సినిమాతో నార్త్ సర్క్యూట్స్‌లో సెన్సేషన్ క్రియేట్ చేశాడని బదులిస్తున్నారు. బన్నీ స్టైలింగ్ కు బాలీవుడ్ దాసోహం అన్న విషయాన్ని మర్చిపోయారా అని ప్రశ్నిస్తున్నారు. అతని సినిమాలను హిందీలోకి డబ్ చేసి వదిలితే.. ఉత్తరాది ఆడియన్స్ మిలియన్ల వ్యూస్ ను కట్టబెట్టడాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. అల్లు అర్జున్ మాస్.. ఊర మాస్.. ఎలా ఉన్నా స్టైలిష్‌గా ఉంటాడు అంటూ బాలీవుడ్ ట్రోలర్స్ కు దీటుగా సమాధానం చెబుతున్నారు. 'పుష్ప: ది రూల్' సినిమాతో నార్త్ లో అన్ని రికార్డులను బద్దలు కొట్టి.. అల్లు అర్జున్ అంటే.. అతని స్టైలింగ్ అంటే ఏంటో చూపిస్తాడని అభిమానులు ధీమాగా ఉన్నారు.

## చిరు సినిమా విలన్‌గా బిజూ మీనన్ ?



మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం వరుస ప్రాజెక్ట్స్‌తో బిజీ ఉన్నాడు. ఇటీవల ఆచార్య సినిమాతో పలకరించిన చిరు ఆ వెంటనే భోళా శంకర్, గాడ్ ఫాదర్‌తో పాటు బాబీ డైరెక్షన్‌లో ఓ సినిమా లైన్లో పెట్టాడు. ఇటీవల గాడ్ ఫాదర్, బాబీ చిత్రాలు సెట్స్‌పైకి రాగా చిరు ఒకేసారి ఈ రెండు మూవీ షూటింగ్స్‌ల్లో పాల్గొంటున్నాడు చిరు. ఈ క్రమంలో మెగా 154 మూవీని సంక్రాంతికి రిలీజ్ చేస్తున్నట్లు ఇటీవల మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ మూవీకి సంబంధించి మరో ఆసక్తిక న్యూస్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలోని ప్రతికథానాయకుడి పాత్ర కోసం చిత్ర బృందం తమిళ హీరో విజయ్ సేతుపతి, నటుడు సముద్రఖనిలను అనుకుంటున్నట్లు ఇప్పటి వరకు వార్తలు వినిపించాయి. అయితే దీనిపై స్పష్టత లేదు. ఈ క్రమంలో తాజాగా మరో నటుడి పేరు తెరపైకి వచ్చింది. విలన్ పాత్ర కోసం మలయాళ స్టార్ నటుడు బీజూమీనన్‌ను తీసుకోవాలని చిత్రబృందం భావిస్తుందట. త్వరలోనే దీనిపై స్పష్టత రానుందని సమాచారం. 'అయ్యప్పనుమ్ కోషియుమ్'తో బిజు మీనన్ పేరు దక్షిణాదిన మారు మోగిపోయింది. కాగా బిజూ మీనన్ 'రణం' సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇక చిరంజీవి ఈ చిత్రంలో అండర్‌కవర్ కాప్‌గా కనిపించనున్నాడు. విశాఖపట్నం నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ చిత్రంలో శృతిహాసన్ హీరోయిన్‌గా నటిస్తుంది. మాస్‌రాజ రవితేజ కీలకపాత్రలో నటిస్తున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నారు. ఈ మూవీకి వాల్తేరు వీరయ్య అనే టైటిల్ చిత్ర బృందం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

## బండ్ల గణేశ్ వ్యాఖ్యలకు పూరీ కౌంటర్



పేరు చెప్పకుండానే పూరి జగన్నాథ్ బండ్ల గణెశ్‌కు కౌంటర్ ఇచ్చారు. తన మ్యూజింగ్స్ ద్వారా ఓ వాయిస్ విడుదల చేశారు. గుర్తు పెట్టుకోండి. మన నాలుక కదులుతున్నంత సేపు మనం ఏమి నేర్చుకోలేం. అందుకే జీవితంలో ఎక్కువ సేపు వింటూ ఉండాలి. ఎవరి విషయంలో అయినా ఆచితూచి మాట్లాడండి. చీప్‌గా వాగొద్దు.. చీప్‌గా ప్రవర్తించొద్దు. మన వాగుడు మన కెరీర్‌ను, క్రెడిబిలిటీని డిసైడ్ చేస్తుంది. 'నొప్పింపక తానొవ్వక తప్పించుక తిరుగువాడు ధన్యుడు సుమతీ' అనే సుమతీ శతకం మీరు వినే ఉంటారు. తప్పు మాట్లాడటం కంటే నాలుక కొరికేసుకోవడం చాలా మంచిది. చివరగా ఒక మాట.. నీ లైఫ్, నీ డెత్.. నీ టంగ్ మీద ఆధారపడి ఉంటుంది. అని ఆ వాయిస్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఇది నెట్టింట్లో వైరల్ అవుతుంది. అయితే ఈ వాయిస్‌లో పేరు చెప్పకపోయినప్పటికీ ఈ కౌంటర్ బండ్ల గణెశ్ కోసమే అని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

## ఒకే ఫ్రేమ్‌లో స్టార్ హీరోలు



ఒకే ఫ్రేమ్‌లో బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్, విక్టరీ వెంకటేష్, మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ , పూజా హెగ్డే ఉపాసనా రామ్ చరణ్ కనిపించి అభిమానులకు కనువిందు చేస్తున్నారు. సల్మాన్ ఖాన్ తాజా చిత్రం 'కభీ ఈద్ కభీ దీవాలి' చిత్రంలో విక్టరీ వెంకటేశ్ ప్రత్యేక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. రామ్‌చరణ్ సైతం ఇందులో అతిథి పాత్రలో కనిపిస్తాడని వార్తలొస్తున్న నేపథ్యంలో ఈ ఫోటో మరింతగా విశేషాన్ని సంతరించుకుంది. అయితే ఈ సినిమాలో చరణ్ నటిస్తున్నాడా లేదా అన్న విషయాన్ని పక్కన పెడితే.. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ లో చిత్రీకరణ జరుపుకుంటోంది. షూటింగ్ బ్రేక్‌లో రామ్ చరణ్, ఉపాసన దంపతులు సెట్లో సందడి చేశారు. ముంబై వెళ్ళినప్పుడు రామ్ చరణ్ తప్పకుండా సల్మాన్ ఖాన్ ను కలుస్తాడని, చరణ్ అక్కడ ఉన్నన్ని రోజులు సల్లూభాయ్ అతడికి కావల్సిన ఏర్పాట్లు చేస్తాడని ప్రచారం ఉంది. అందుకే సల్మాన్ ఖాన్ హైదరాబాద్ లో ఉన్నన్ని రోజులు రామ్ చరణ్ దగ్గరుండి అన్ని విషయాల్ని చూసుకుంటున్నాడట. ఈ సందర్భంలోనే సల్మాన్ ఖాన్, వెంకటేశ్, రామ్ చరణ్, ఉపాసన, పూజా హెగ్డే కలిసి ఈ ఫోటోను దిగారని తెలుస్తోంది. ఒకే ఫ్రేమ్ లో ఇంతమంది స్టార్స్ ఉండడంతో అభిమానులు తెగ ఖుషీ అవుతున్నారు. సల్మాన్ ఖాన్ మెగాస్టార్ చిరంజీవి 'గాడ్‌ఫాదర్' లో ప్రత్యేక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సల్మాన్ ఖాన్ 'కభీ ఈద్ కభీ దీవాలి' చిత్రంలో మన స్టార్స్ వెంకీ, చెర్రీ నటిస్తుండడం విశేషం.

## వైష్ణవ్ తేజ్ డైలాగులు అదరహో




దీనమ్మా జీవితం మానవత్వం చచ్చిపోయింది భయ్యా' అంటున్నారు పంజా వైష్ణవ్ తేజ్ . ఆయన హీరోగా నటిస్తున్న మూడో చిత్రం 'రంగరంగ వైభవంగా' లోని డైలాగ్ ఇది. ప్రస్తుతం నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోంది. గిరీశయ్య దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వరా సినీ చిత్ర పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. ఇందులో వైష్ణవ్ తేజ్ చెప్పిన డైలాగ్‌లు ఆకట్టుకుంటున్నాయి. నన్నే చూస్తావ్..రా గురించే కలలు కంటావ్...నన్నే ప్రేమిస్తావ్ కానీ... నాతో మాట్లాడటానికి ఈగో... అని హీరోయిన్ కేతిక శర్మ చెప్పిన రొమాంటిక్ డైలాగ్‌లు ఆకట్టుకుంటున్నాయి. ఫ్రెండ్: 'ఏంటే కలిసొచ్చారు... కలిసిపోయారా? కేతిక శర్మ: నువ్వెలా వచ్చావ్.. అని స్నేహితురాలు అడిగిన ప్రశ్నకుఫ్రెండ్: ఆటోలో... కేతిక: మరి ఆటోవాడు నువ్వు కలిసిపోయారా? అంటూ సాగిన డైలాగులు నవ్వులు పూయించేలా ఉన్నాయి. టీజర్ 'ఖుషి' సినిమాను గుర్తు చేస్తోందని, వైష్ణవ్ తేజ్ మేనరిజం పవన్‌కల్యాణ్‌ను తలపిస్తోందని అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. పంజా వైష్ణవ్ తేజ్, కేతిక శర్మ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com